క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌ను అభినందిస్తున్న వీఆర్వోలు

పొదలకూరు: మండల తహసీల్దార్‌గా (ఎఫ్ఏసీ) శివకృష్ణయ్య మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తరలింపు



ముత్తుకూరు: ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా మత్స్య కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న బీఎఫ్ఎస్సీ విద్యార్థులు మంగళవారం మల్లూరులో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ త్రివేణి, శ్రీవిద్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం మానేయాలంటూ ర్యాలీ జరిపారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ జరిగింది.

హుండీ రాబడి రూ.2.56 లక్షలు



తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ పంచాయతీలో ఉన్న జ్వాలాముఖీ అమ్మవారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు పర్యవేక్షణలో మంగళవారం సాగింది. ఆరునెలల కాలానికి సంబంధించి రూ.2.56 లక్షల నగదు వచ్చింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోడూరు శ్రీనివాసులు రెడ్డి, కర్పూరం శ్రీనివాసులు, జలదంకి శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోలాహలంగా పోలేరమ్మ జాతర



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని శాంతినగర్‌లో పోలేరమ్మ జాతరను వేడుకగా మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ



మాట్లాడుతున్న సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీలో ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారికి బకాయి పడిన వడ్డీలో 50 శాతం రాయితీని ఇవ్వనున్నామని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆస్తి, ఇంటి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించిన వడ్డీలో ఈ రాయితీ వర్తించనుందని పేర్కొన్నారు. ఇప్పటికే చెల్లించిన వారికి రానున్న సంవత్సరాల్లో తగ్గించనున్నామన్నారు. పన్నులను ఈ నెల 31లోపు చెల్లించాలని కోరారు.

అమ్మో.. హైవే

- మండలంలో 12 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదం

అతివేగం.. మద్యం మత్తు.. నిర్లక్ష్యపు డ్రైవింగ్ తదితర కారణాలతో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా.. మరి కొందరు గాయాలపాలై మంచానికి పరిమితమై ఆర్థికంగా చితికిపోతున్నారు.



వెంకటాచలంలో ఘటనా స్థలంలో వాహనాలు (ఫైల్)



గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

వెంకటాచలం: మండలంలో చెముడుగుంట పంచాయతీ పరిధి నుంచి రామదాసుకండ్రిగ వరకు 12 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. అలాగే రామదాసుకండ్రిగ వద్ద నుంచి పంటపాళెం వరకు 10 కిలోమీటర్ల దూరం వరకు కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే రహదారి ఉంది. వీటిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్లలో పదుల సంఖ్యలో జరిగిన యాక్సిడెంట్లలో 15 మంది మృతిచెందారు. 24 మంది గాయాలపాలయ్యారు. అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం తాగి నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం తదితరాలు ప్రమాదాలకు కారణాలుగా ఉంటున్నాయి.

ఎక్కువగా ఎక్కడంటే..

చెముడుగుంట పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంకు, వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్‌రోడ్డు, కసుమూరు క్రాస్ రోడ్డు, కాకుటూరు రోడ్డు, కృష్ణపట్నం పోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే జాతీయ రహదారి నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే మార్గంలో సర్వేపల్లి రైల్వేగేటు, తాటిపర్తిపాళెం రైల్వేగేటు, పుంజులూరుపాడు క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో యాక్సిడెంట్ల సంఖ్య అధికంగానే ఉంది. చెముడుగుంట పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంకు వద్ద వాహనాలు రోడ్డు క్రాస్ అయ్యే సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే నివారణకు పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకు జాతీయ రహదారి ఆనుకుని ఉండటంతో.. రోడ్డు దాటే వాహనాలను హైవేపై వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొడుతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్డు దాటే ప్రయాణికులు సైతం ఈ ప్రాంతంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఆగి ఉన్న లారీలతో సమస్యలు

జాతీయ రహదారి నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే మార్గంలో ఆగి ఉన్న లారీల వల్ల రాత్రి వేళల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. నాయుడుపాళెం పెట్రోల్ బంకు, తాటిపర్తిపాళెం, పంజులూరుపాడు సమీపాల్లో రాత్రి వేళల్లో లారీలను డ్రైవర్లు రహదారులపైనే నిలిపివేస్తున్నారు. ఇక్కడ లైట్లు సక్రమంగా లేనికారణంగా రాకపోకలు కొనసాగించే వాహనచోదకులు ఆగి ఉన్న లారీలను ఢీకొడుతూ మృత్యువాత పడుతున్నారు. కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే ఈ రహదారి వెంబడి పామాయిల్ ఫ్యాక్టరీలు అధికంగా ఉన్నాయి. ఈ కంపెనీల్లో పనిచేసే వందల మంది యువకులు ద్విచక్ర వాహనాలపై నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. అయితే రాత్రి 8 గంటల నుంచి లారీలను డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తుండటంతో ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నాయి. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నవోదయకు ఎంపిక



స్నేహలత

పొదలకూరు: నవోదయ విద్యాలయకు పట్టణంలోని అమరావతి స్కూల్ విద్యార్థిని పిల్లిపాక స్నేహలత ఎంపికైంది. ఆరో తరగతిలో ప్రవేశానికి జరిగిన పరీక్ష ఫలితాల్లో బాలిక ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.సురేష్ మంగళవారం స్నేహలతను అభినందించారు.

మర్యాదపూర్వకంగా..

కొడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ బుచ్చిరెడ్డిపాళెం మండలాధ్యక్షుడిగా ఎంపికైన కోవూరు రాఘవ.. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావును మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథిగృహంలో కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలను తెలియజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించనున్నామని ఈఓ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, బ్యాంక్ సిబ్బంది తదితరుల ఆధ్వర్యంలో ప్రక్రియను నిర్వహించనున్నామని చెప్పారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో మంగళవారం శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ – పోస్‌లో ఫీడ్ చేసిన ఎరువులు, గోదాములో ఉన్న ఎరువుల నిల్వకు తేడా ఉండటాన్ని గుర్తించారు. 16.530 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసును నమోదు చేశారు. ఎరువుల విలువ రూ.2,92,360గా అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ నరసింహారావు, ఏఓ వేణుగోపాల్‌రావు, విజిలెన్స్ ఏసీటీఓ విష్ణురావు, మండల వ్యవసాయాధికారి వాసు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతి



ఎంపీహెచ్ఏలకు సన్మానం

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరు పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లో గ్రేడ్ – 3 ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న ఏడుగురికి సమీప మండలాల్లోని పీహెచ్‌సీల సబ్ సెంటర్లలో ఎంపీహెచ్ఏలుగా ఉద్యోగోన్నతి లభించింది. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వెంకటమ్మ, జి.దేవి, ధనలక్ష్మి, శైలజ, ఉషారాణి, రోజ్‌మేరీ, రమాదేవిని వైద్యాధికారులు దేవీకృప, చందనప్రియ తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ షుక్కూర్, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, హెల్త్ అసిస్టెంట్ బూదూరు బాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన యూత్ పార్లమెంట్ – 2025



విద్యార్థులతో వీసీ శ్రీనివాసరావు తదితరులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ – 2025 కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒకే దేశం – ఒకే ఎన్నిక అనే పోటీ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతిభ చూపిన వారికి వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమానికి పంపుతామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: శ్రవణా నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. భక్తులకు నిర్వాహకులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న జేసీబీ

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు గ్రామ పరిధిలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను ఎస్సై శివరాకేష్ సమక్షంలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. సర్వే నంబర్ 90 – 4లో 5.56 ఎకరాల భూమి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన ఒకరు ఎకరా భూమిని ఆక్రమించి చుట్టూ కంచి వేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అప్పట్లో ఆక్రమణను కార్యదర్శి చెంచమ్మ అడ్డుకోగా ఆ భూమి తమదేనని దౌర్జన్యానికి దిగారని వెల్లడించారు. దీంతో కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసుల సమక్షంలో ఆక్రమణలను తొలగించామన్నారు. కార్యదర్శి చెంచమ్మ, సర్వేయర్ శ్రీహరి, వీఆర్వో సుకుమార్ పాల్గొన్నారు.

నేతన్న నేస్తం అమలుకు డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

పొదలకూరు: చేనేతలకు ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు డిమాండ్ చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం చేనేతలతో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ కార్యాలయం వద్ద నాయకులు మంగళవారం దరఖాస్తులు చేయించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు పముజుల శంకరయ్య, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పుకోటి లక్ష్మీనారాయణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందజేసి సరిపెట్టుకోవడం సరికాదన్నారు. నేతన్న నేస్తం పథకాన్ని తిరిగి అమలు చేయాల్సిందిగా పేర్కొన్నారు. చేనేత పరిశ్రమపై కేంద్రం విధిస్తున్న జీఎస్టీని రద్దు చేస్తామని, నేతన్నలకు ఆరోగ్య బీమా వర్తింపజేస్తామని, 50 వయసు దాటిన చేనేతలకు పింఛన్ అందజేస్తామని ప్రకటించినా ఆ దిశగా అడుగులు వేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బత్తూరి మురళి, బొమ్మన సుబ్రహ్మణ్యం, పన్నెల వెంకటేశు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నోటిఫికేషన్

- ఎంపీపీ ఎన్నికలకు ఏర్పాట్లు
- ఉప ఎన్నిక జరపకుండానే ప్రక్రియ
- కోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ
- నేటి మధ్యాహ్నం విచారణ

కోవూరు: విడవలూరు మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి ఎన్నికను నిర్వహించేందుకు నోటిఫికేషన్‌ను జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేసింది. వాస్తవానికి మండలంలో 14 మండల ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి. ఈ మండల పరిషత్ అధ్యక్ష పీఠంపై గిరిజన మహిళకు రిజర్వేషన్ ఉంది. గతంలో ఎన్నికలు నిర్వహించిన సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 12 మంది, సీపీఎం నుంచి ఇద్దరు గెలుపొందారు. విడవలూరు బిట్ – 2 ఎంపీటీసీగా గెలుపొందిన వేణుంబాక భవానమ్మను ఎంపీపీగా ఎన్నుకున్నారు. అయితే ఆమె అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో ఈ స్థానానికి ఉప ఎన్నికను నిర్వహించి ఆ తర్వాతే ఎంపీపీ ఎన్నికలను జరపాల్సి ఉంది. అయితే దీనికి విరుద్ధంగా ఎన్నికలను గురువారం నిర్వహించేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు.

టీడీపీ కండువా కప్పుకొన్న మహిళకు అవకాశం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఊటుకూరు ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొందిన గిరిజన మహిళ ఏకొల్లు శేషమ్మ ఇటీవల టీడీపీ కండువా కప్పుకొన్నారు. విడవలూరు ఎంపీపీ స్థానంలో ఈమెను నిలబెట్టి ఎన్నికలను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారని తెలుస్తోంది. ఉప ఎన్నికను నిర్వహించకుండా ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేయడంపై హైకోర్టును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆశ్రయించారు. విచారణకు కేసు బుధవారం రానుంది. తుది తీర్పు వెలువడే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. ఒకరు మరణించడం, మరో ఇద్దరు టీడీపీ కండువా కప్పుకోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం ప్రస్తుతం తొమ్మిదిగా ఉంది.

విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

కొడవలూరు: విశిష్ట సంఖ్యను సొంత పొలమున్న రైతులు నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు.. వ్యవసాయ శాఖ రాయితీలు పొందాలన్నా విశిష్ట సంఖ్య తప్పనిసరని చెప్పారు. నమోదు చేసుకోవడంలో చాలా మంది రైతులు జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏ ఉమామహేష్, సొసైటీ సీఈఓ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ రద్దును ప్రశ్నిస్తే.. ప్రతి విమర్శలా..?



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: ఎస్సీకి కేటాయించిన కోవూరు ఏఎంసీ చైర్మన్ పదవిని రద్దు చేయించి ఓసీకి ఇచ్చి.. అన్యాయం చేసిన అంశమై ప్రశ్నించగా, ప్రతి విమర్శలకు దిగడం శోచనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని తన అతిథి గృహ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన వంశీకృష్ణారెడ్డికి కోవూరు ఏఎంసీ చైర్మన్ పదవిని కట్టబెట్టే ఉద్దేశంతో ఎస్సీలకు అన్యాయం చేయడం ఎంతవరకు సబబని తాను ప్రశ్నించానని చెప్పారు. ఆయన చేసిన మూడు పనులను ఆధారాలతో సహా చూపానని, వీటికి సమాధానాలు చెప్పకుండా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కనీసం వార్డు సభ్యుడిగా గెలవని వంశీకృష్ణారెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీలో చేరి పబ్బం గడుపుకొనే ఆయన తన స్థాయేమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. వంశీకృష్ణారెడ్డికి ఏఎంసీ చైర్మన్ పదవిని కట్టబెట్టేందుకు ఎస్సీ రిజర్వేషన్‌ను రద్దు చేయించామని, ఉగాది కానుకగా దీన్ని ఇస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే స్వయంగా చెప్పిన వీడియోను ప్రదర్శించారు. ఎంపీపీ జ్యోతి, సర్పంచ్‌లు సుప్రియ, రంగారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, నేతలు కొండా శ్రీనివాసులు రెడ్డి, మాణిక్యరావు, తాటిపర్తి భాస్కర్, కొట్టే మల్లికార్జున, దేవిరెడ్డి సాయిరెడ్డి, జడ్డా సాయికుమార్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



సూచనలు చేస్తున్న వేణుగోపాల్

ఇందుకూరుపేట: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరులో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలను ప్రభుత్వం అదనంగా అందిస్తోందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కోవూరు: రైతుల కోసం మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ నిర్మలానందబాబా పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 510 మంది రైతులు నుంచి ఆరు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. దాదాపు లక్షన్నర గోతాలను రైతులకు ఇచ్చామని, ధాన్యాన్ని కోవూరు, నెల్లూరులోని మిల్లులకు పంపామన్నారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం

కోవూరు: అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని ఎస్పీడీసీఎల్ కల్పించిందని కోవూరు ఈఈ రమేష్ చౌదరి పేర్కొన్నారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 50 శాతం రాయితీతో జూన్ 30లోపు క్రమబద్ధీకరించుకోవచ్చని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాడ్జిలో వ్యక్తి మృతి

నెల్లూరు (క్రైమ్): లాడ్జిలో అద్దెకు దిగిన వ్యక్తి మృతి చెందిన ఘటన వహాబ్‌పేటలోని సీవీఆర్ రెసిడెన్సీలో మంగళవారం చోటుచేసుకుంది.. పోలీసుల సమాచారం మేరకు.. చెన్నైకి చెందిన రోహన్ (45).. లాడ్జిలో ఈ నెల 19న దిగారు. అప్పటి నుంచి పెయింట్ పనులు చేసుకొని తిరిగి లాడ్జికి వచ్చేవారు. అనారోగ్యంగా ఉండటంతో సమీపంలోని హాస్పిటల్‌కు సోమవారం వెళ్లి చికిత్స చేయించుకొచ్చారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలోనూ గది నుంచి బయటకొచ్చి మళ్లీ లోపలికెళ్లారు. మరోవైపు ఉదయం ఎనిమిది గంటలకు రూమ్‌ను ఖాళీ చేయాల్సి ఉండటంతో, విషయాన్ని గుర్తుచేసేందుకుగానూ గది వద్దకు సిబ్బంది వెళ్లి తలుపుతట్టగా, తీయలేదు. పక్కనే ఉన్న కిటికీ నుంచి చూడగా, బెడ్డు పక్కనే నేలపై రోహన్ పడి ఉండటాన్ని చూసి తలుపులను బలవంతంగా తెరిచారు. అపస్మారక స్థితిలో ఉండటంతో 108కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు రోహన్‌ను పరిశీలించి, అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. సమాచారం అందుకున్న చిన్నబజార్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. నిర్వాహకుడు పెంచలకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.